# కోటిలో నొకటి

రచయిత: రావిపల్లి నారాయణరావు

"ఈజనాన్ని త్రోసుకురాకపోతే ఆడాళ్ల పెట్టిలో ఎక్క లేక పోయావ్" అన్నాడొకాయన.

"ఎందుకెక్కుతారు? యిది మగాళ్ల పెట్టని వ్రాయలేదుగా" చిరాగ్గా సమర్థించిందొకంఠం.

"అలా త్రోసుకుపోతావేంకర్మ మీద గంప; ముందు..." నమిలేడు ఫుట్ బోర్డుపై నుంచొని గజాన్ని పట్టుకు వ్రేలాడే మరొకతను.

"ఏంకాలమో, యేంరాతో చదువుకునే ఆడాళ్లకంటె మితిమీరిపోతున్నారీ పల్లెపడుచులు" పలికింది మరోగొంతు. నలుగురు నాలుగు విధాల మాట్లాడుతున్నారు. మొరిగేకుక్కల అరుపులకేం అనుకుంది కాబోలు ఆవిడ ఎలాగైతేనేం లోనికొచ్చి తలుపుకానుకునిల్చుంది బండి కదిలింది. ఎవరిమట్టుకు వారు సర్దుకున్నారు. నెత్తిన గంపపెట్టుకుని తలుపుకానుకు నిల్చున్న కాంతామణి కార్నర్‌లో కూర్చున్న నా కంటబడింది.

స్టేషన్‌లో ట్రైన్ ఆగడంతో నాదృష్టి ప్లాటుఫారంపైపడింది కాంతామణి రాకకెదురుచూస్తు — ఆమెజాడ కనిపించలేదు. ఈరోజు రాలేదేమో అనుకున్నా. బండి కదిలేక నా చూపులు పెట్టిలో ప్రసరించేయి. తలుపుప్రక్క నించున్న కాంతామణి నా కంటబడింది. నాకళ్లు చలించేయి. లోకల్‌ట్రెయిన్ పరుగిడుతోంది. బండికుదుపుకు ఎత్తయిన వక్షోజాలు ఎర్రజాకెట్టులో గెంతువేస్తు నన్ను కలవర పెడుతున్నాయి. చక్రాల్లానుండే గుండ్రని కనుపాపలు పరిహాసం చేస్తున్నాయి. ముక్కుక్రింద మెదలుతున్న చిన్ననత్తుపల్లెజీవితాన్నిజ్ఞాపకంచేస్తుంది. సహజ సౌందర్యాన్ని చూస్తు అనందిస్తున్నాయి నాకళ్లు. దృష్టిక్రిందకు వొరిగింది. నా ముఖం నిర్జీవమయింది. 'కృష్ణ కృష్ణ గుమ్మిడికాయలా గర్భంతోనున్న పరస్త్రీనిచూచి నా వళ్లు పులకరిస్తోందేమిటి? ఏమిటీ అన్యాయం? పరస్త్రీ విముఖుడనైన నాకు కడుపుతోనున్న పడతిపై వ్యామోహం ఏంటి? ఎంత దురంతరం!' నాలో నేనే తిట్టుకున్నాను కోరికల నణగద్రొక్కుతూ.

ట్రెయిన్ తనపని అది చేసుకుపోతోంది. నిండు చూలాలు అలా నిల్చుంటే ఒక్కరు కూర్చోమని స్థలం చూపించలేదు. నా మనస్సు బాధపడి గుండెకరిగింది. ఒక్కడు కరుణార్ద్ర హృదయుడీ పెట్టెలో లేడా అని నేననుకున్నాను.

"అందరి మనస్తత్వాలగురించి ఆలోచించేకంటె నీ మనస్సు గురించాలోచించకూడదు? కాలుపై కాలువేసుకు కూర్చున్నావ్ కార్నర్‌సీటులో. నీ స్థలం ఆమెకెందుకీయకూడదు?" అనడిగింది మనస్సు. అందరు స్థలం యీయకపోవటంవలన అంత దూరాననున్న అమ్మాయిని పిలిచి నాచోటు చూపించటానికి నాకు ధైర్యం చాలలేదు.

నాదృష్టి ఎర్రజాకెట్టును పట్టుకువదలటంలేదు మనస్సు తిట్టుకున్నా దానితో సంబంధంలేనట్టు. నే నామెను చాలా కాలంనుండి చూస్తున్నాను. అదేవేళకు ప్రతిరోజు అట్రెయిన్‌లోనే అమె వస్తూవుంటుంది. నేను ఆవేళకే మా ఆఫీసు నుండి తిరిగివస్తుంటాను. నా చూపులు ఆ ఎర్రజాకెట్టు స్నేహంచేసి నా ఏకపత్నీవ్రతాన్ని భంగపరుస్తుంటాయి. మనస్సులోని మమకారాలను అణచుకొనేసరికి తలప్రాణంతోకకొచ్చేటట్టవుతోంది. ఆ కాంతలో ప్రత్యేకాకర్షణమిటో నా కర్థంకాలేదు.

"పదహారేళ్లు నిండని ఆ పడతికి గుమ్మడికాయి లాంటి గర్భమేమిటి?"

"అదేలేకపోతే నీమనస్సేమయేది?" మనస్సు పలికింది. 'అదిగో అప్పుడే మళ్లా పిచ్చిపిచ్చి ఆలోచనలు. ప్రకృతానందాన్ని నే విమర్శిస్తుంటే యీ మనస్సుకు యివేం పాడుబుద్ధులు' మనస్సుకు వార్నింగిచ్చేను.

మనస్సుని ప్రశ్నించేను—

"గంప నెత్తినపెట్టుకుని రోజు ఈమె ఎక్కడికి పోతున్నట్టు?"

"పాలమ్మటానికేమో!"

"గంప కాళీగా వుందే?"

"అమ్మకు తిరిగొస్తున్నట్టుంది"

"నాకోసం సందేహం?"

"ఏమిటది?"

"నాలుగు నెలలనుండి చూస్తున్నా. ఆమె గర్భంలో మార్పు కనపడవేం?"

"మంచి ప్రశ్నవేసావు రోజు చూస్తువున్నజీవి పెరుగుతున్నట్టనిపిస్తోందా?"

ప్రశ్నలకిమనస్సుసమాధానపర్చింది.

మరోస్టేషన్‌లో బండి ఆగింది. పెట్టెలోని జనం దిగకుండా ఎక్కుతున్నారు ప్లాటుఫారంపైనుండి. తలుపు దగ్గర జనాన్ని తోసుకుంటూ జబర్దస్తీగా ఎక్కేడో పొడుగాటి మనిషి మెలికెలు తిరిగే మీసాలు నొత్తుకుంటూ. అతను నెత్తిపై గంపనేసుకు నిల్చున్న కాంతామణిని చూచి 'ఏమే సీతి వ్యాపారం సరిగ్గా జరుగుతోందా?' అన్నాడు.

"వ్యాపారం అంటాడేమిటి? బ్రోతల్ కంపెని కాదుగదా?

ఆడాళ్లు ఎంత పనికైన తెగిస్తారు కార్నర్‌సీటులో కదలుతూ అనుకున్నా. ప్రక్కస్టేషన్‌లో బండాగింది. మీసాలు తిరిగున్న పొడుగాటి మొగాడు, గంప నెత్తినేసుకున్నసీతి యిద్దరుబండిదిగారు.

ఆరోజు శనివారం. సూర్యుడు నడినెత్తిన పొడుస్తున్నాడు. ఒంటిగంటవుతుందనుకుంటా. ట్రెయినుకి వేళయిందని గబగబా స్టేషన్‌కు పోతున్నాను. మార్గమధ్యాన్న కనిపించిందో జనసమూహం. నా కాళ్ళు అటు లాక్కెళ్ళేయి. జనాన్ని తోసుకుని లోనికెళ్లేను. సారావాసన గుప్పున కొట్టింది, నా కాశ్చర్యం వేసింది. నా కళ్లను నే నమ్మలేకపోయాను; రోజు చూచిన ఆ కాంతామణి అదే సీతినక్కడచూచి ఆశ్చర్యం! ఎత్తుగా గుండ్రంగా గుమ్మడికాయలా కనపడే ఆమె గర్భం మాయమైంది. చేతిలో పిల్లాడులేడు. ప్రసవించిందనటానికి ఆటువంటి చిహ్నాలు ఆమె ముఖములో గోచరించలేదు. ఇప్పుడామె యింపుగా కన్పించింది నాకంటికి. చిరపరిచితుడ్ని చూచినట్టు నాదిక్కుచూచి ఆమె ముఖం దించుకుంది. చినిగిన ఎర్రజాకెట్టునుండి పొంచిచూచే ఎత్తైన వక్షోజాలు నన్ను పలకరించేయి. దృష్టి నాటంకపరచటానికి గుమ్మడికాయలాంటగర్భంలేకపోయేసరికి నాచూపులు నఖశిఖ పర్యంతం సర్వేచేస్తున్నాయి. ఆమె కిరుప్రక్కల లాఠీలుపట్టుకునిల్చున్నారు పోలీస్‌జవాన్లు. గుండ్రంగావున్న రబ్బరుట్యూబు క్రిందపడివుంది. లోపలున్న సారాని టెస్టుచేసి మధ్యవర్తుల యెదుట సీళ్లు వేస్తున్నాడు సబ్‌యిన స్పెక్టర్. కడుపని ప్రజల కళ్ళుకప్పి ట్రెయిన్లో ట్రాన్స్‌పోర్టుచేసే సారా ట్యూబునుచూచి నేననుకున్నా 'కూటికై చేసే కోటివిద్యల్లో నొక'టని. ★